ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అనంతపురం
జిల్లా వార్తలు

గురువారం 4 జనవరి 2024





కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

నగరపాలికను చెత్తతో ముంచెత్తిన కార్మికులు

సీఎం మోసగించారని ప్రధానికి సమగ్రశిక్ష ఉద్యోగుల లేఖలు

ఆందోళనలతో అట్టుడుకుతున్న జిల్లా కేంద్రం

# సర్కారుపై దండయాత్ర

శ్రామిక, ఉద్యోగ వర్గాల్లో గూడు కట్టుకున్న అసంతృప్తి ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. అంగన్‌వాడీలతో మొదలై.. సమగ్రశిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల దాకా సమ్మె విస్తరించింది. విధులను బహిష్కరించి.. బాధిత వర్గాలన్నీ ఆందోళనబాట పట్టాయి. రోడ్లపై రణన్నినాదం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి స్పందన లేక పోవడంతో పోరును తారస్థాయికి తీసుకువెళుతున్నాయి. ఇందులో భాగంగా అంగన్‌వాడీలు బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. వేలాదిగా తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. నగరపాలిక వద్ద నడిరోడ్డుపై పారిశుధ్య కార్మికులు భోజనం చేశారు. చెత్తను తీసుకువెళ్లి నగరపాలిక కార్యాలయ ఆవరణలో పడేసి నిరసన తెలిపారు. సీఎం జగన్ తమను మోసగించారని, తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రధాని మోదీకి లేఖలు రాశారు.

## కదంతొక్కిన అంగన్‌వాడీలు

### నగరంలో ర్యాలీ.. కలెక్టరేట్ ముట్టడి



రోడ్డుపై భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు



అనంతపురంలో అంగన్‌వాడీల ర్యాలీ

**అనంతపురం విద్య, జనవరి 3:** సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలు బుధవారం ప్రభుత్వంపై దండయాత్ర చేశారు. పోలీసులు నోటీసులు జారీ చేసినా, దారికాచి అడ్డుకున్నా.. కలెక్టరేట్ ముట్టడికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారు. తమ భవిష్యత్తు కోసం ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేశారు. సమ్మెలో భాగంగా 23వ రోజు బుధవారం కలెక్టరేట్ ముట్టడికి నాయకులు పిలుపునిచ్చారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, వేలాది మంది వర్కర్లు, ఆయాలు ఉద్యమంలో భాగమయ్యారు. కళ్యాణదుర్గం, గుత్తి, గుంతకల్లు, పామిడి, తాడిపత్రి, కూడేరు, కంబదూరు తదితర ప్రాంత్రాల నుంచి అనంతపురానికి తరలివచ్చారు. సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో లలిత కళాపరిషత్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, చేతుల్లో కొబ్బరి చిప్పలు పట్టకుని యాచిస్తూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించారు.



మాట్లాడుతున్న రాంభూపాల్



## ప్రభుత్వంలో చలనమేదీ..?

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 23 రోజులుగా రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మండిపడ్డారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోగా, బెదిరింపులకు దిగడం వైసీపీ ప్రభుత్వ దగాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. సచివాలయ ఉద్యోగులు, పోలీసుల చేత అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి ప్రవేశించాలని చూడటం హేయమని అన్నారు. ఈ దగాకోరు, బెదిరింపుల ప్రభుత్వానికి ఎన్నికల్లో పతనం తప్పదని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. అందుకే అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం కయ్యానికి కాలుదువ్వుతోందని అన్నారు. మహిళలు ఆగ్రహిస్తే వైసీపీ ప్రభుత్వం గల్లంతుకావడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శకుంతల, రమాదేవి, జమున, ఐద్వా కోశాధికారి సావిత్రి, సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆర్‌పీ నాయుడు, నల్లప్ప, చంద్రశేఖర్, రామాంజినేయులు, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై భోజనం



నడిరోడ్డుపై భోజనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**అనంతపురం క్రైం:** నగరంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఉధృతం అవుతోంది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. నగరపాలిక కార్యాలయం ఎదుట నడిరోడ్డుపై కార్మికులు భోజనం చేశారు. నగరపాలిక కార్యాలయ ఆవరణలో చెత్త వేసి నిరసనను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా శ్రమదోపిడీకి పాల్పడుతోందని అన్నారు. డిమాండ్లను అంగీకరించేదాకా సమ్మె కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సీఐటీయూ ఒకటో పట్టణ కార్యదర్శి వెంకట్ నారాయణ, రెండో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజా, ముర్తుజా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.





నగర పాలిక కార్యాలయంలో కార్మికులు వేసిన చెత్త



కళ్యాణదుర్గంలో కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు



ఉద్యోగుల చేతికి జగన్ చిప్పలు ఇచ్చాడని చూపుతూ.. నిరసన

## ఉద్యోగ భద్రత కల్పించండి

**అనంతపురం విద్య:** సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా బుధవారం 15వ రోజు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి పోస్టు కార్డులు రాశారు. నాలుగున్నరేళ్ల కిందట సమగ్రశిక్ష పరిధిలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, ఇప్పుడు తాము కేంద్రం పరిధిలోని ఉద్యోగులమని జగన్ తప్పించుకుంటున్నారని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ విమర్శించారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ఏపీ సీఎం జగన్‌పై కేంద్రం ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, అర్జున్, సాయిరాం, యూటీఎఫ్ నేతలు, విద్యార్థి సంఘాల నేతలు మద్దతు తెలిపారు.





నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

## నీటి కష్టం



ట్యాంకర్లతో మిరప పంటకు నీరు పెడుతున్న రైతు

హంద్రీనీవా నీటిపై ఆధారపడి పంటలు సాగుచేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన బొజ్జప్ప పెద్ద కొట్టాలపల్లి వద్ద సుమారు ఎనిమిది ఎకరాల్లో మిరపను సాగు చేశాడు. సాగునీరు అందకపోవడంతో మూడు నెలలు క్రితం బిందెలు, బక్కెట్లతో నీరుపోసి మొక్కలను కాపాడుకున్నారు. ప్రస్తుతం పంట కాయదశలో ఉంది. దీంతో రెండు రోజుల నుంచి మూడు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి మిరప పంటను తడుపుతున్నారు. ఎకరానికి 10 ట్యాంకర్ల నీరు పోస్తున్నారు. రోజుకు రూ.40 వేల దాకా ఖర్చు చేస్తున్నాడు. ఫిబ్రవరి మొదటి వారం వరకూ ఇంకో మూడు తడులు ఇస్తేగాని పంట చేతికి రాదని బాధిత రైతు అంటున్నారు. హంద్రీనీవా పిల్ల కాలువకు సాగునీరు రానందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. - విడపనకల్లు



మిరప సాళ్లలో పారుతున్న నీరు..



మొక్కదశలో నీరు పోస్తూ.. (ఫైల్)

## బొజ్జాను విడుదల చేయకపోతే బుద్ధి చెబుతాం

### రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక హెచ్చరిక



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డిని విడుదల చేయకపోతే సీఎం జగన్‌కు బుద్ధి చెబుతామని రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. క్లాక్ టవర్ వద్ద బుధవారం ఆ సమితి నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రాయలసీమ హక్కుల గురించి మాట్లాడే గొంతుకలను అక్రమ అరెస్టులతో నొక్కివేసే ప్రయత్నం చేయడం ప్రభుత్వానికి మంచిది కాదని అన్నారు. సిద్దేశ్వరం అలుగు, రాయలసీమ సాగునీటి హక్కుల విషయంలో జగన్ నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు తెలియజేస్తున్నారనే కక్షతోనే బొజ్జాను అరెస్టు చేశారని ఆరోపించారు. బొజ్జాను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా ఉద్యమాలు నిర్వహించి సీఎం జగన్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, నగేష్, నరేంద్ర, రైతుకూలీ సంఘం నాయకుడు క్రిష్టప్ప, పట్టణ పేదల సంఘం నాయకుడు వీర నారప్ప, కుల నిర్మూలన పోరాట సంఘం నాయకులు శ్రీరాములు, ఓపీడీఆర్ నాయకుడు అడ్వొకేట్ ప్రకాష్, అనంత హక్కుల పోరాట సంఘం నాయకుడు సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు

## పింఛన్ ఆలస్యం

**అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3:** పింఛన్ పెంచామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం.. లబ్ధిదారులకు పింఛన్ అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,91,982 మంది లబ్ధిదారులకు రూ.87.46 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ రూ.20 కోట్లు మాత్రమే ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి పైగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, 5 వేల మందికి మాత్రమే జాబితాలో చోటు కల్పించారు. అనంతపురం నగరంలో మూడు వేలకు పైగా దరఖాస్తులు రాగా, 347 మందికి మాత్రమే పింఛన్ మంజూరు చేశారు. మిగిలిన వారిలో అధికశాతం అర్హులు ఉన్నా, నిబంధనల పేరిట ఎంపిక చేయలేదు. జిల్లాలో 32 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇలా మొత్తం 38 ప్రాంతాలకు గాను ఇప్పటి వరకూ 15 ప్రాంతాల్లో మాత్రమే పింఛన్ పంపిణీని ప్రారంభించారు. 23 మండలాలలో ఇప్పటికీ పంపిణీ మొదలు కాలేదు. నిధులు ఇవ్వనందుకే ఈ పరిస్థితి ఏర్పడింది. పింఛన్ పెంపు కారణంగా పంపిణీలో జాప్యం జరుగుతోందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. మొదటి రోజున 15 ప్రాంతాల్లో మాత్రమే పంపిణీ చేశామని, వారోత్సవాల్లో భాగంగా మిగిలిన ప్రాంతాలవారికి త్వరలోనే అందజేస్తామని తెలిపారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌రెడ్డి, అనంత అర్బన్ వైసీపీ మైనార్టీ, కుల సంఘాల నాయకులు

## టీడీపీలోకి కాంగ్రెస్, వైసీపీ నాయకులు

### చంద్రబాబు సమక్షంలో చేర్పించిన ప్రభాకర్ చౌదరి

**అనంతపురం అర్బన్, జనవరి 3:** అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ మైనార్టీ నాయకులు టీడీపీలో చేరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజీవ్‌రెడ్డి, వైసీపీ మైనార్టీ నాయకులు, కుల సంఘాల నాయకులు సైకిల్ ఎక్కారు. పార్టీలో చేరినవారిని ప్రభాకర్ చౌదరి అభినందించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ, కాంగ్రెస్, కుల సంఘాల నాయకులతో ప్రభాకర్ చౌదరి

## ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

**అనంతపురం టౌన్ జనవరి 3:** ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానానికి సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను జేఎన్‌టీయులో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరు అధికారులతో కలిసి ఏర్పాట్లపై జేఎన్‌టీయులో పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కౌంటర్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి..? ఎన్ని గదులు అవసరమవుతాయి..? తదితర విషయాలపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జేసీ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయిత్రీదేవి. ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, నగరపాలక కమిషనర్ భాగ్యలక్ష్మీ, ఎన్నికల విభాగం అధికారులు భాస్కర్, కనకరాజు ఉన్నారు.

## నార్పలలో ఒకరికి కరోనా

**అనంతపురం టౌన్ జనవరి 3:** మండల కేంద్రమైన నార్పలలో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. బుధవారం జిల్లా ఆసుపత్రికి సంబంధిత లక్షణాలతో వచ్చిన 25 మంది శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. ఇందులో నార్పలకు చెందిన 35 సంవత్సరాల యువకుడికి కరోనా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయాన్ని డీఎంహెచ్ఓకు తెలియజేశామన్నారు. నార్పల వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తిని పరిశీలించారని, అతను ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. అయినా అవసరమైన మందులు ఇచ్చి హోంఐసొలేషన్‌లో ఉండాల్సిందిగా సూచించామన్నారు. ఆ యువకుడి కుటుంబ సభ్యులను పరీక్షించడం జరుగుతుందన్నారు. కాగా గతంలో నమోదైన మూడు కరోనా కేసులకు సంబంధించి ఒక వ్యక్తి జిల్లా ఆసుపత్రిలో చికిత్స తీసుకుని డిశ్చార్జి అయ్యాడన్నారు. మిగిలిన ఇద్దరూ హోంఐసొలేషన్‌లో ఉంటూ చికిత్స తీసుకున్నారని, ప్రస్తుతం వీరు ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

## అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

**ధర్మవరం, జనవరి 3:** పట్టణంలోని కేశవనగర్‌లో అప్పుల బాధ భరించలేక చేనేత కార్మికుడు వనం శ్రీనివాసులు (47) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... కేశవనగర్‌కు చెందిన శ్రీనివాసులు కూలిమగ్గం నేస్తుండేవాడు. నేసిన చీరకు గిట్టుబాటు ధర లభించక కుటుంబ పోషణ భారమైంది. రూ.5లక్షలదాకా అప్పులు చేశాడు. మగ్గం నేస్తే అప్పులు తీర్చలేనని భావించి 8 నెలల క్రితం హోటల్లోకి పనికెళ్లాడు. ఆరోగ్యం సహకరించక వదిలేశాడు. అప్పులు ఎలాతీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని, మరణించాడు. ఆస్పత్రికి వెళ్లిన అతడి తల్లి వనం శేషమ్మ ఇంటికి తిరిగొచ్చి చూడగా కొడుకు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో తల్లి బోరున విలపించింది. చుట్టుపక్కల వారు వచ్చి శ్రీనివాసులు మృతదేహాన్ని కిందకు దించి, పోలీసులకు సమాచారం అందించారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులుకు భార్య భాగ్యమ్మ, కుమార్తె రోజా ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. భార్య మూడేళ్లక్రితం విడాకులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు.. తల్లి వద్దనే ఉంటుండేవాడు.

## పాత భవనాల పరిశీలన

**గుత్తి, జనవరి 3:** గుత్తి రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా పలు పాత భవనాలను గుంతకల్లు సీనియర్ డీపీఓ జేఎస్ చౌహన్, సీనియర్ డీఈఎన్ సంజీవ్‌రావు బుధవారం పరిశీలించారు. ఆర్గనైజేషన్, వ్యాయామ భవనంతోపాటు పలు శిథిలావస్థలో ఉన్న వాటిని చూశారు. రైల్వే ఇనిస్టిట్యూట్, కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. వారి వెంట ఏడీఈఎన్ ప్రభాకర్, ఎస్ఎస్ వర్క్ నగేష్‌నాయక్ ఉన్నారు.

## రెండు దుకాణాల్లో చోరీ

**ధర్మవరం, జనవరి 3:** పట్టణంలోని ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కనున్న రెండు దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజస్ దుకాణంపై ఉన్న రేకులను తొలగించి రూ.60వేలు నగదు, రూ.1.50లక్ష విలువ చేసే కరెంటు వైర్లు, రూ.50వేలు విలువ చేసే ఫ్యాన్లు, గీజర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా పక్కనే ఉన్న మొబైల్ షాపు రేకులను తొలగించి కంప్యూటర్, నాలుగు మొబైల్ ఫోన్లు, సామగ్రితోపాటు దాదాపు రూ.40వేలు చోరీ చేశారు. ఉదయం ఆయా దుకాణాల యజమానులు నరేశ్‌రెడ్డి, రామ్‌కుమార్‌ల చోరీ జరిగినట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సంఘటనాస్థలాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నీరివ్వకపోతే నాయకులను నిర్బంధిస్తాం

### హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నాలో సీపీఐ నాయకులు



హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

**అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3:** హంద్రీనీవాను నమ్ముకుని పంటలు సాగు చేశాం.. ఎండిపోతున్న పంటలకు వారంలోపు నీరివ్వకపోతే జిల్లాలోని అధికారపార్టీ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తామని వైసీపీ ప్రభుత్వానికి రైతుల తరపున సీపీఐ నేతలు అల్టిమేటం జారీ చేశారు. హంద్రీనీవా కింద సాగు చేసిన పంటలకు సాగునీరు ఇవ్వాలని, సీఎల్‌డీపీ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హంద్రీనీవా కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ రైతులను దగా చేసిన సీఎం జగన్‌కు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్నదాతలను నిర్లక్ష్యం చేస్తే ఉసురు తప్పదని హెచ్చరించారు. నాలుగున్నరేళ్ళుగా జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు పైసా ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కరవును దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవడం కనీస బాధ్యతని, దానిని కూడా సీఎం విస్మరించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో సీట్లు అమ్ముకోవడంపై దృష్టి పెట్టడం దారుణమన్నారు. వెంటనే హంద్రీనీవా నీటిని జీబీసీతో పాటు రిజర్వాయర్లు, చెరువులకు, ఆయకట్టుకు వారం రోజుల్లో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఈ కార్యాలయంలోకి వెళ్లి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్ఈ దేశేనాయక్ స్పందిస్తూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీబీసీకి సాగునీరు అందజేసి పంటలను కాపాడుతామన్నారు. సీఎల్‌డీపీని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు నారాయణస్వామి, రామకృష్ణ, రమేష్, అల్లీపీరా, రమణయ్య, మనోహర్, వెంకటనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం కోసం ప్రత్యేక మేనిఫెస్టో



శివాలయంలో పూజలు చేయిస్తున్న పరిటాల శ్రీరామ్



సమస్యలు తెలుసుకుంటూ...

### ప్రతివార్డులో సమస్యలను తెలుసుకుంటాం
### అధికారంలోకి రాగానే పరిష్కరిస్తాం
### పాదయాత్రలో పరిటాల శ్రీరామ్

**ధర్మవరం, జనవరి 3:** ప్రత్యేకంగా ఓ మేనిఫెస్టోను ధర్మవరం కోసం రూపొందిస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఐదురోజుల పాదయాత్రకు శ్రీకారంచుట్టారు. శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 7వ వార్డు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక నాయకులతో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో మాట్లాడుతూ మినీమేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని మినీ మేనిఫెస్టోను రూపొందించారన్నారు. అదేస్ఫూర్తితో స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు గుట్టకిందపల్లిసెంటర్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతంకాటమయ్య, ఫణికుమార్, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, అత్తర్ రహీంబాషా, గోసలశ్రీరాములు, కేశగాళ్లశీన, బొట్టుకిష్ట, మహేశ్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

# 23 నుంచి అనంతలో లఘుచిత్ర వారోత్సవాలు



లఘుచిత్ర వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, జనవరి 3:** అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో 6వ అనంత లఘుచిత్ర వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా తెలిపారు. బుధవారం ఎస్ఎస్ ప్యారడైజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని విద్యుత్ కళావేదిక ఆవరణలోని మినీ థియేటర్‌లో వారోత్సవాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. 26, 27వ తేదీల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు రూపొందించిన లఘుచిత్రాల ప్రదర్శన, మొబైల్ ఫిల్మ్ మేకింగ్ లఘుచిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. 28న ఉత్తమ లఘుచిత్రాలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ సంప్రదాయ కళలు, వారసత్వ సంపదలపై సెల్‌ఫోన్ ద్వారా నిర్మించిన షార్ట్స్, రీల్స్, లఘుచిత్రాలకు రూ.5వేలు, కవర్‌సాంగ్‌లు రూపొందించిన నృత్య దర్శకులకు రూ.3వేలు, రూ.2వేల చొప్పున ఇద్దరికి నగదు అందజేస్తామని వివరించారు. షార్ట్ ఫిల్మ్ విభాగంలో మొదటిస్థానంలో నిలిచిన విజేతకు రూ.5వేలు, ద్వితీయ స్థానానికి రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ.2వేలు అందించనున్నామన్నారు. పోటీదారులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలు, మొమెంటో, సర్టిఫికెట్ల ప్రదానం ఉంటుందన్నారు. లఘుచిత్ర వారోత్సవాల్లో పాల్గొనదలచిన వారు తమ లఘుచిత్రాలు, షార్ట్స్, రీల్స్ యూట్యూబ్ లింకులను ఈనెల 20వ తేదీలోపు 9676350681 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 6302746071 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో కంబదూరి షేక్ నబిరసూల్, తోట బాలన్న, హొన్నూరప్ప, రాఘవేంద్ర, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ప్లేట్లలో ఆకులు పెట్టుకుని తింటూ..
మోకాళ్లపై కూర్చుని నిరసన చేపట్టిన కార్మికులు

## సమ్మెలో 'శ్రీరామిరెడ్డి కార్మికులు'

### 325 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

**కళ్యాణదుర్గం, జనవరి 3:** శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు సమ్మెబాట పట్టారు. పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, ప్లేట్లలో ఆకులు పెట్టుకుని, మోకాళ్లపై కూర్చుని బుధవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. మూడు రోజులుగా అక్కడే ఉంటూ వంటా వార్పు చేస్తూ, వినూత్న నిరసనలు చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. ఈ సమ్మెను ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### కణేకల్లులో..



కణేకల్లులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

**కణేకల్లు:** శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమ్మె మూడో రోజు కొనసాగింది. మండలంలోని ఆలూరులో ఉన్న పంప్‌హౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి తమ నిరసనను తెలియజేశారు.

## బకాయిలు చెల్లించాలి

### కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూటీఎఫ్ నాయకులు

**అనంతపురం విద్య, జనవరి 3:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వక్తలు, యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ నాయకులు 12 గంటల ధర్నా నిర్వహించారు. ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపద రూ.15 లక్షల కోట్లు ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఏర్పడటం శోచనీయమన్నారు. ఆదాయ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 15 తేదీ వరకూ జీతాలు జమ చేయలేని పరిస్థితులు రాష్ట్రంలో ఈ ప్రభుత్వం వల్ల ఏర్పడ్డాయన్నారు. సకాలంలో జీతాలు పడక రుణాలు తీసుకున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు లోన్స్ ఈఎంఐలు సకాలంలో చెల్లించకలేక ఫైన్లు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, డాక్టర్ ప్రసూన, ఐద్వా నాయకురాలు సావిత్రి, రామాంజినమ్మ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో డీఏలు, పీఆర్సీ అరియర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 9,10 తేదీల్లో విజయవాడలో 36 గంటలు ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, సీపీఎం రాంభూపాల్, ఇతర నేతలు రమణయ్య, సుధాకర్, రామప్ప, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ఈశ్వరయ్య, మహమ్మద్ జిలాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గేయానంద్



## స్నేహితులు హేళన చేశారని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**నార్పల, జనవరి 3:** మండల కేంద్రంలోని కేజీబీవీలో స్నేహితులు హేళన చేశారని విద్యార్థిని అశ్విని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివారాల్లోకి వెళితే... మండలంలోని హెచ్ సోదనపల్లి గ్రామానికి చెందిన అశ్విని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. పాఠశాలలోని తోటి స్నేహితులు అశ్వినిని అసభ్యంగా మాట్లాడమే కాకుండా హేళన చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక విషం సేవించి అపస్మారక స్థితిలో పడిపోయింది. తోటి విద్యార్థినులు గమనించి వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు ఆ బాలికను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా ఎమ్మార్పీఎస్, కమ్యూనిస్టు నాయకులు కస్తూర్బా బాలికల పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు గుర్తించి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎస్ఓ నిర్మలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోను అందుబాటులోకి రాలేదు.




చిన్నంపల్లి, పెరవలిలో అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

## రాములోరి అక్షింతల పంపిణీ

**అనంతపురంరూరల్, జనవరి 3:** మండలంలోని చిన్నంపల్లి గ్రామంలో అయోధ్య రాముని అక్షింతలను బుధవారం పంపిణీ చేశారు. గ్రామస్థులు శ్రీరాముడి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తూ.. శ్రీరాముడి కీర్తనలు ఆలపిస్తూ.. అక్షింతులు పంపిణీ చేశారు.

**శింగనమల :** మండలంలోని పెరవలిలో అయోధ్య రాముని అక్షింతలను బుధవారం ఘనంగా ఊరేగించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భజన చేస్తూ గ్రామంలో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తూ.. అక్షింతలు పంచారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు రామ్మోహన్, గ్రామ భజన సభ్యులు కృష్ణ, వరదరాజులు, చిన్నలింగన్న, రామచంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి అప్పస్వామి, దామోదర్ పాల్గొన్నారు.

**రామగిరి:** మండలంలోని నసనకోటలో అయోధ్య శ్రీరాములు అక్షింతలు బుధవారం ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు.

## అచ్చెన్నాయుడిని కలిసిన జిల్లా నాయకులు



అచ్చెన్నాయుడుతో జిల్లా నాయకులు

**అనంతపురం అర్బన్, జనవరి 3:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని టీఎన్‌టీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, నాయకులు గౌస్‌పీరా కలిశారు.

## టీడీపీ బీఎల్‌ఏ ఓటు తొలగింపు

**చెన్నేకొత్తపల్లి, జనవరి 3:** తన ఓటును ఓటరు జాబితా నుంచి తొలగించారని చెన్నేకొత్తపల్లికి చెందిన టీడీపీ నాయకులు, బీఎల్‌ఏ బన్యాల సూర్యనారాయణ వాపోయాడు. 249 బూత్‌లో ఎన్‌డీఎఫ్ 1844935 ఎపిక్ నెంబర్‌తో సీకేపల్లిలో ఓటు ఉండేదన్నారు. బుధవారం ఫొటో, ఆధార్ కార్డు తీసుకుని రావాలని బీఎల్‌ఓ ఫోన్ ద్వారా తెలిపారన్నారు. దీంతో అసలు విషయం వెలుగు చూసిందన్నారు. ఎవరో ఫారం-7 దరఖాస్తు చేయడంతో తన ఓటును తొలగింపు జాబితాలో ఉంచినట్లు తెలిపారు. దీంతో తాను మళ్లీ ఫారం-6 నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి

**ధర్మవరంరూరల్, జనవరి 3:** కనగానపల్లి మండలం దాదులూరు వద్ద 44వ జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహారాష్ట్రకు చెందిన కూలీ హరినాథురామ్ వాగ్మేర్ (54) బుధవారం అక్కడికక్కడే మరణించాడు. అతను దాదులూరు వద్ద బొగ్గులు కాల్చుకుని జీవనం సాగించేవాడు. ఉదయం రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు వెళ్లి పరిశీలించగా... అప్పటికే అతను మరణించినట్లు గుర్తించారు. మృతదేహాన్ని కనగానపల్లి పోలీసులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హరినాథురామ్‌కు భార్య లక్ష్మీహరివాగ్మేర్ ఉన్నారు.

## అనారోగ్యంతో బి.పప్పూరు సర్పంచు ..



బాధితులను ఓదార్చుతున్న ఆలం, ఎంఎస్ రాజు

**నార్పల, జనవరి 3:** మండలంలోని బీ పప్పూరు గ్రామ సర్పంచు, టీడీపీ మద్దతు దారుడు చీమల పెద్దన్న (55) బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం రాత్రి మరణించాడు. ఆయన మంగళవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసా నాయుడు ఆసుపత్రికి చేరుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ చీమల పెద్దన్న మరణించాడు.

## ఆలయ జీర్ణోద్ధరణకు రూ.5 లక్షల విరాళం

**అనంతపురం కల్చరల్, జనవరి 3:** స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పనుల నిమిత్తం మాజీ కార్పొరేటర్ గంగన లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు రూ.5లక్షలు విరాళం అందజేశారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ రూ.1.5 కోట్లు మంజూరుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందులో 20 శాతం నిధులను మ్యాచింగ్ గ్రాంట్ కింద భక్తుల విరాళాల ద్వారా సేకరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఆలయ పాలకమండలితో బుధవారం సాయంత్రం దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. అదేవిధంగా తనవంతుగా రూ.2 లక్షలు విరాళమందిస్తానని ఆలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

## 1,251 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

**అనంతపురం అర్బన్, జనవరి 3:** జిల్లాకు బుధవారం 1,251 మెట్రిక్ టన్నుల 10-26-26 రకం ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రిటైల్ డీలర్లు, ఆర్బీకేలకు వాటిని సరఫరా చేస్తామన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించండి

**అనంతపురం టౌన్, జనవరి 3:** తమ సమస్యలు పరిష్కరించాలంటూ ల్యాబ్ టెక్నీషియన్లు డీఎంహెచ్‌ఓ ఈబీ దేవిని విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ విడుదల చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం నాయకులు శ్రీధరబాబు, వేణుగోపాల్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా ఉద్యోగోన్నతలు ఇవ్వకపోవడంతో సీనియర్లకు అన్యాయం జరుగుతోందని, 2014 తర్వాత నియమితులైనవారికి 100 శాతం గ్రాస్ జీతం ఇవ్వాలని. సెలవులపై క్లారిటీ ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్, డీఎంఓ డాక్టర్ ఓబులు, ఏఓ గిరిజా మనోహర్. ల్యాబ్‌అసిస్టెంట్లు సుదర్శన్, మస్తాన్, సుజాత, తనూజ పాల్గొన్నారు.

## ఎనిమిది ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు

**అనంతపురం టౌన్ జనవరి 3:** జిల్లాలో బుధవారం మున్సిపల్, పట్టణ ప్రాంతాల్లో ఎనిమిది చోట్ల ఆరోగ్యసురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. అనంతపురం నగరంలోని హమాలీకాలనీలో ఏర్పాటు చేసిన క్యాంపును ఆమె పరిశీలించారు. మొత్తం మీద 3,332 మంది ఈ క్యాంపుల ద్వారా వైద్యసేవలు పొందారన్నారు. వీరిలో 14 మందికి మెరుగైన వైద్యసేవలకు రెఫర్ చేసామన్నారు.

## మట్కా బీటర్ అరెస్టు

**అనంతపురం క్రైం, జనవరి 3:** అనంతపురం రూరల్ పరిధి ఎస్‌బీఐ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అలాగే అతను కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 115 టెట్రా ప్యాకెట్లు, రూ. 12,080 స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

## కురబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కురబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కురబ సంఘం యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కురుబ నారాయణస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కురబలకు ఎంపీ, ఎమ్మెల్యే సీటు కేటాయిం చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి లక్ష్మన్న, బ్యాళ్ల రాముడు, మైలగాని సుధాకర్, లోలూరు నారాయణస్వామి, లాయర్ గోపాల్ పాల్గొన్నారు.

# నీ హామీ ఏమైంది ప్రకాష్..?

## ఎమ్మెల్యేపై మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజం



రాప్తాడులో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

**ఆత్మకూరు, జనవరి 3:** 'నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చావ్.. ఎమ్మెల్యే అయ్యావ్.. నాలుగున్నర సంవత్సరమైంది. తోపుదుర్తి, ముట్టాల రిజర్వాయర్లు పనులు ఎంతవరకు వచ్చాయ్. ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చావ్.. ఇప్పుడు ఎన్నికలు వచ్చే వేళకు మళ్లీ లేనిపోని హామీలిస్తున్నావ్.. ఇక ప్రజలు నిన్ను నమ్మే స్థితిలో లేరు...' అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. స్థానిక పాత ఎస్సీ కాలనీ, కొత్త ఎస్సీ కాలనీ, జయరాం కాలనీ, కుర్లపల్లిలో బుధవారం ఆమె ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా... కేవలం తమ ఆస్తుల అభివృద్ధిపైనే దృష్టి పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని, రిజర్వాయర్లు పూర్తి చేసి డ్యాంను కృష్ణ నీటితో నింపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి బాలాజి, కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు పరుశురామ్, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, మాజీ ఎంపీపీ మారెక్క, మాజీ జడ్పీటీసీ కుళ్ళాయప్ప, మాజీ కన్వీనర్లు క్రిష్ణమోహన్ చౌదరి పాల్గొన్నారు.

**రామగిరి :** చంద్రబాబునాయుడును సీఎంగా చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సూచించారు. బుధవారం మండలంలోని ఎంసీపల్లి పంచాయతీలో ఎంసీపల్లి, మంగాపురం గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, మాజీ సర్పంచ్ ముత్యాలు పాల్గొన్నారు.



ఎంసీపల్లిలో ప్రచారం చేస్తున్న నారాయణచౌదరి, టీడీపీ నాయకులు

## సర్పంచుల సమర శంఖారావానికి జిల్లా నాయకులు




చంద్రబాబుకు బొకే అందజేస్తున్న డేగల, పార్టీ కార్యాలయం వద్ద రాప్తాడు మండల సర్పంచులు

**శింగనమల, జనవరి 3:** మంగళగిరిలో బుధవారం నిర్వహించిన సర్పంచుల సమర శంఖారావం సదస్సు జిల్లా నుంచి పలువురు తరలివెళ్లారు. ఈ సదస్సుకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని సన్మానించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి తెలిపారు.

**రాప్తాడు :** సర్పంచుల సమర శంఖారావం సదస్సుకు రాప్తాడు మండల టీడీపీ సర్పంచులు తరలివెళ్లారు. రాప్తాడు, గొందిరెడ్డిపల్లి, బోగినేపల్లి, గాండ్లపర్తి సర్పంచులు సాకే తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, నరేష్, వార్డు సభ్యులు గేటు సత్తి, రాము పాల్గొన్నారు.

## స్వీట్స్‌స్టాల్స్‌లో విజిలెన్స్ తనిఖీ



స్వీట్ స్టాల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

**అనంతపురం న్యూటౌన్, జనవరి 3:** స్వీట్ స్టాల్స్, డ్రై ఫ్రూట్స్ సెంటర్లపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక భవాని స్వీట్స్, భవానీ డ్రై ఫ్రూట్స్ సెంటర్, షిరిడి సాయి స్వీట్ హౌస్, అజ్వాన్ ఇంటర్నేషనల్ రిటైల్ స్టోర్ తదితర వాటిల్లో తనిఖీలు చేపట్టారు. తయారీదారుడి పేరు, తయారు తేది, ఎమ్ఆర్పీ ధర లేకపోవడంతో కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు ఉన్నతాధి కారులకు నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రామారావు, ఏఓ వాసుప్రకాస్, లీగల్ మెట్రాలజీ అధికారి మహ్మద్‌గౌస్, డీసీటీఓలు విజయలక్ష్మీ, సురేష్ కుమార్, ఎస్ఐ శేషగిరి, ఏఈఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

## శింగనమల ఎస్ఐగా చంద్రశేఖర్



**శింగనమల జనవరి 3:** శింగనమల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విజయభాస్కర్ అనంతపురం రూరల్ స్టేషన్‌కు బదిలీ కాగా.. అనంతపురం 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ చంద్రశేఖర్‌ను శింగనమలకు బదిలీ చేశారు.

## కక్కలపల్లిలో గ్రామ సభ

**అనంతపురంరూరల్, జనవరి 3:** మండలంలోని కక్కలపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, జరగాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, సర్పంచు క్రిష్టయ్య, ఉపసర్పంచు రమేష్ పాల్గొన్నారు.

## న్యాయం కోసం ధర్నా చేస్తాం

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** శ్రీభక్త కనకదాస కల్యాణ మండపంలో తన అగ్రిమెంట్ కాలం ఉన్నప్పటికీ... కొందరు అన్యాయం చేస్తున్నారని లైటింగ్ అండ్ సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడు కురబ సుధాకర్ వాపోయాడు. బుధవారం ఆయన కురబ కులస్థులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తాను కళ్యాణ మండపంలో ప్రతి కార్యక్రమానికి మాట్లాడుకున్న నగదులో 25 శాతం చెల్లిస్తున్నానన్నారు. అయితే కొంతమంది స్వార్థపరులు ఎవరికి తెలియకుండా వేలం నిర్వహించారని, ఇద్దరు వ్యక్తులు రూ. 22.50 లక్షలకు వేలం పాడారని, తనను తొలగించాలంటూ దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. తనకు న్యాయం జరగకపోతే ఆదివారం గుత్తి రోడ్డులోని శ్రీ భక్తకనకదాస విగ్రహం ఎదుట ధర్నా చేస్తానన్నారు.

## సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక బాలసదన్‌లో ఆమె చిత్రపటానికి బుధవారం పలువురు నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర బాలసదన్‌లోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జశ్వంత్ వ్యాస్, చిట్రా నాగరాజు, విష్ణు, ఇమామ్ హుస్సేన్, బాలు, అంకె తేజ, తలారీ అంజి, బుర్ర శ్రీనివాసుబాబు గౌడ్, కొడికి మధు, బండి అరుణ్, అక్కిరాజు సాగర్, భార్గవ్, మహేష్ ఆచారీ, శాలివాహన వెంకటేష్, నరసింహులు, కార్తీక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సిబ్బందితో సీసీఎఫ్ భేటీ



సీసీఎఫ్‌కు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న అధికారులు

**అనంతపురం న్యూటౌన్, జనవరి 3:** జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వరరావు సిబ్బందితో భేటీ అయ్యారు. డీఎఫ్‌ఓ సందీప్ కృపాకర్ బదిలీ కావడం, వినీత్ కుమార్ నూతన డీఎఫ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో సీసీఎఫ్ రాక ప్రత్యేకతను సంతరించుకొంది. అయితే నూతన డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ లీవ్‌లో ఉండటంతో ఎలాంటి శాఖపరమైన అంశాలపై సీసీఎఫ్ సిబ్బంది చర్చించలేదు. కొద్ది సేపు సిబ్బందితో మాట్లాడిన ఆయన తిరిగి వెళ్లారు. జిల్లా కేంద్రానికి ఆయన వచ్చినట్లు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## పింఛన్ల పెంపు నూతన సంవత్సర కానుక




మాట్లాడుతున్న కలెక్టర్

**అనంతపురంరూరల్, జనవరి 3:** రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పెంచి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర కానుక ఇచ్చిందని కలెక్టర్ గౌతమి అన్నారు. బుధవారం మండలంలోని పాపంపేటలో పెన్షన్ పెంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రూ. 3 వేలు పింఛన్లు పెంపు వలన 2.31 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఉమాదేవి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యాచకుడికి అమ్మ సంస్థ అండ



యాచకుడికి ట్రైసైకిల్, దుస్తులు ఇస్తున్న రమణారెడ్డి

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ సమీపంలో యాచకవృత్తి చేసుకుంటున్న గంగప్పకు అమ్మ సంస్థ అండగా నిలిచింది. బుధవారం ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి గంగప్పకు రూ. 25 వేలు విలువ చేసే ట్రైసైకిల్, రూ. 10 వేలు ఆర్థికసాయం, రూ. 5 వేలు విలువ చేసే దుస్తులు అందజేశారు. రమణారెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో యాచకుడు గంగప్పకు చిన్న రేకులషెడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. గంగప్ప షుగర్ వ్యాధి, వెన్నెముకకు సంబంధించిన వ్యాధులకు ప్రతినెలా మందులు అందజేస్తామన్నారు.

## భూకబ్జాకు వైసీపీ నేతల కుట్ర

**చెన్నేకొత్తపల్లి, జనవరి 3:** వైసీపీ నేతలు తన భూమిని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని మండలంలోని కనుముక్కల టీడీపీ కార్యకర్త, రైతు ఎం.నేలకోటప్ప వాపోతున్నాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కనుముక్కలలో పుట్టపర్తి-ధర్మవరం రహదారి ప్రక్కన సర్వేనెంబర్ 231-2ఏ, 2బీ, 2సీలలో కలిపి 1.36 ఎకరాలు పట్టా భూమిని మూడు తరాల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. ఆరేళ్లక్రితం తన పేరిట డిపట్టా వచ్చిందని, ఆ భూమిలో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని అన్నారు. కొందరి వైసీపీ నాయకుల అండదండలతో గ్రామానికి పలువురు తన భూమిని కాజేయడానికి కుట్ర పన్నారన్నారు. ఆ భూమికి సంబందించి ఆన్‌లైన్ చేసుకోవడానికి తాను ప్రయత్నించినప్పటికి అడ్డుకొంటున్నారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరితే తహసీల్దార్‌ను కోరితే.. ఏవైనా ఆధారాలుంటే కలెక్టర్‌కు నివేదించుకోవాలని చెబుతున్నాడని అన్నారు. తాను టీడీపీ కార్యకర్త కావడం వల్లే దాదాపు 80 ఏళ్ల నాటి భూమిని దౌర్జన్యంగా వైసీపీ నాయకులు కాజేస్తున్నారని వాపోయాడు. తాజాగా మంగళవారం తన భూమిలో వైసీపీ నాయకులు సర్వే చేస్తుండగా అడ్డుకోపోగా తనపై దౌర్జన్యానికి దిగారన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. దీనిపై తహసీల్దార్ షాబుద్దీన్‌ను వివరణ కోరగా.. ఆ భూమిలో సర్వేకు సంబంధించి తనకు ఇంతవరకు రిపోర్టు అందలేదన్నారు. నేలకోటప్ప భూమికి సంబంధించి ఏవైనా ఆధారాలుంటే తీసుకుని రావాలని రికార్డులను పరిశీలిస్తామని అన్నారు.




వివాదాస్పద భూమి, పట్టా చూపుతున్న రైతు నేలకోటప్ప




నాదెండ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న భవానీ రవికుమార్, పెండ్యాల శ్రీలత, పెండ్యాల హరి, పెండ్యాల మౌనేష్

## జనసేన పీఏసీ చైర్మన్‌ను కలిసిన జిల్లా నేతలు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** మంగళగిరి జనసేన పార్టీలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను జిల్లా నేతలు బుధవారం కలిశారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి అనంత జిల్లాలో పార్టీ బలోపేతం చేసే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందని మనోహర్ సూచించినట్లు వారు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో జనసేన, టీడీపీ గెలుపుకు క్షేత్రస్థాయిలో అందరూ కలిసి పనిచేయాలని బోధ చేసినట్లు తెలిపారు. వారి వెంట నాయకులు పెండ్యాల హరి, పెండ్యాల మౌనేష్ ఉన్నారు.

## జనసేన బలోపేతమే లక్ష్యం

### పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో జిల్లా అధ్యక్షుడు వరుణ్



కార్యాలయ ప్రారంభోత్సవంలో వరుణ్, జనసేన నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 3:** రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం తపోవనంలో ఆ పార్టీ నగర కార్యదర్శులు లాల్‌స్వామి, వల్లంశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలని, అందుకు అన్ని విధాలా పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ క్రియాశీలక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, కిరణ్ కుమార్, సిద్ధూ, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నాయకులు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, చక్రపాణి, హుస్సేన్, దరాజ్ బాష, జక్కిరెడ్డి పద్మావతి, కుమ్మర మురళీ, వీర మహిళలు అనసూయ పాల్గొన్నారు.

## జాతీయ చెస్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

**అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3:** ఇటీవల తమిళనాడు వేలూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ చెస్ పోటీలలో అండర్-14 జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇందులో జిల్లాకు చెందిన శ్రీహ, త్రిపురాంబిక, కటారి సజ్యోత్స్న, అస్మిత అనిమి, శ్రావ్యశ్రీ పతకాలు సాధించారు. ఆ క్రీడాకారులను, కోచ్ ఆదిరత్నకుమార్‌ను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ బుధవారం అభినందించారు.

### 6న జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

జిల్లా స్థాయి జూనియర్ బాలుర హాకీ ఎంపిక పోటీలు శనివారం అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ అనంతపురం కార్యదర్శి అనీల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, పదో తరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణపత్రం, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 94900 33474ను సంప్రదించాలన్నారు.

### 6, 7 తేదీల్లో జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

జిల్లాస్థాయి సీనియర్ వెటరన్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 6,7 తేదీల్లో అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్, ఉపాధ్యక్షులు షఫీ, దాదాఖలందర్ బుధవారం తెలిపారు. 30 ఏళ్ల నుంచి 60ఏళ్ల వయసున్న క్రీడాకారులు అర్హులన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే సింగిల్స్, డబుల్స్ క్యాటగిరిలలో ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు క్రీడా సామగ్రితో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 93903 34343ను సంప్రదించాలని కోరారు.

### 'ఆడుదాం ఆంధ్రా' టీషర్టులు, టోపీల పంపిణీ

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించిన టీషర్టులు, టోపీలను బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో డీఎస్‌డీఓ ఆయా గ్రామ-వార్డు సచివాలయాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని ఒక్కోక్క గ్రామ-వార్డు సచివాలయానికి 114 టీషర్టులు, టోపీల చొప్పున అందజేశామన్నారు. ఈనెల 10 నుంచి రెండో విడతలో జరిగే మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు టోపీలు, టీషర్టులు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి జూడో పోటీలకు నసనకోట విద్యార్థిని



తేజస్విని

**రామగిరి, జనవరి 3:** మండలంలోని నసనకోట ఉన్నతపాఠశాలకు చెందిన తేజస్విని జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ చామంతి బుధవారం తెలిపారు. చిగిచెర్లలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 40 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి పంజాబ్ రాష్ట్రంలో లుధియానలో ఈనెల 6 నుంచి 11 వరకు జరిగే జాతీయ స్థాయిజూడో పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తేజస్వినిని పాఠశాల హెచ్ఎం నాగరత్న, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

## జేఎన్‌టీయూ ఈసీఈ విభాగాధిపతిగా మమత



మమతను అభినందిస్తున్న, అధికారులు

**అనంతపురం సెంట్రల్, జనవరి 3:** జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగాధిపతిగా డాక్టర్ జి.మమత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసీఈ విభాగాధిపతిగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఎస్. చంద్ర మోహన్‌రెడ్డి.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ (ఐక్యూఏసీ) సభ్యుడిగా ఆన్‌డ్యూటీపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న మమత ఈసీఈ విభాగాధిపతిగా నియమించారు. ఆమె స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ మాధవిని నియమించారు. వీసీ రంగజనార్ధన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు.

## కేబుల్ వైరు చోరీ

**రామగిరి, జనవరి 3:** మండలంలోని నసనకోట గ్రామంలో రెండు గ్రామ పంచాయతీ బోరు బావులకు చెందిన కేబుల్ వైరు మంగళవారం రాత్రి చోరీకి గురైంది. వాటి విలువ రూ. 50 వేలు ఉంటుందని సర్పంచ్ లలితమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గుంతకల్లులో పొర్లుదండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



కళ్యాణదుర్గంలో సమ్మె చేస్తున్న ప్రాంతంలో వంటావార్పు చేస్తూ నిరసన చేపట్టిన మున్సిపల్ కార్మికులు



రాయదుర్గంలో రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## పోరు ఉధృతం

మున్సిపల్ కార్మికులు తమ పోరును ఉధృతం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని నినదించారు. వివిధ ప్రాంతాల్లో బుధవారం వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గుంతకల్లులో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. కళ్యాణదుర్గం సమ్మె శిబిరం సమీపంలో వంటా వార్పు నిర్వహించారు. గుత్తిలో ఒంటికాలిపై నిలబడి తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



గుత్తిలో ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

## దారి కోసం ధర్నా

**విడపనకల్లు, జనవరి 3:** మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల వెనుక ఉన్న కాలనీలో రోడ్డును ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించుకున్న గ్రామ వలంటీరు అమర్‌నాథ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన గోవింద రావు బుధవారం ఉదయం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరాహార దీక్షను చేపట్టారు. గోవిందు రావు మాట్లాడుతూ ఎంపీపీ పాఠశాల వెనుక దాదాపుగా ఐదు ఇళ్లకు రోడ్డు సౌకర్యం ఉండేదని, మట్టి రోడ్డుపై సీసీ రోడ్డును కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. తాను పిల్లల చదువుల కోసం బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఇంటి పక్కన ఉన్న సీసీ రోడ్డును, గ్రామ వలంటీరు అమర్‌నాథ్ ఆక్రమించి రోడ్డుపై రేకుల షెడ్డును నిర్మించాడన్నారు. వైసీపీ నాయకుల అండతోనే వలంటీరు దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించాడన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించిన దీక్ష మధ్యాహ్నం 3గంటల వరకూ నిర్వహించినా అధికారులు పట్టించుకోలేదు. విడపనకల్లు పోలీసులు వచ్చి గోవిందు రావు దీక్షను భగ్నం చేసి తహసీల్దారు ముందు కూర్చో బెట్టారు.

తహసీల్దారు ఈరమ్మ మాట్లాడుతూ రహదారి విషయంగా అక్కడి ప్రజలు ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. ఇంటి పత్రాలు చూపితే కొలతలు వేసి న్యాయం చేస్తామని గోవిందురావుకు చెప్పారు. ఇది తమ రెవెన్యూ పరిధిలోకి రాదని గ్రామ పంచాయతీలోకి వస్తుంది ఈ విషయం కూడా గ్రామ కార్యదర్శి మహబూబ్ బాషాకు తెలిపామన్నారు. రెండు రోజుల్లో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై గోవిందు రావు మాట్లాడుతూ రెండు రోజుల్లో రోడ్డుపై ఉన్న రేకుల షెడ్డును తొలగించక పోతే విడపనకల్లు గ్రామ సచివాలయం ముందు పురుగు ల మందును తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.



గోవిందురావుతో మాట్లాడుతున్న తహసీల్దారు

## అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు



కలెక్టరేట్ ముట్టడికి బయల్దేరిన అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

**కళ్యాణదుర్గం, జనవరి 3:** సీఐటీయూ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చినా, వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా కళ్యాణదుర్గం నుంచి వివిధ మార్గాల్లో కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు బయల్దేరారు. వాట్సప్ గ్రూప్‌ల్లోను, మొబైల్స్ సమాచారం ద్వారా ఎక్కడెక్కడ ఉన్నారని, పోలీసులు గుర్తించి, బస్సులను ఎక్కడికక్కడే ఆపి, అందులో వెళ్తున్న అంగన్‌వాడీ కార్య కర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తీసుకెళ్లారు. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా తమ సమస్యలను పరిష్కరించేతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న అంగన్‌వాడీలు

**యాడికి, జనవరి3:** తమ సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు బుధవారం అనంతపురంలోని కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కలెక్టరేట్ ముట్టడికి తరలిన వారిలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి హేమావతి, రవణకుమారి తదితరులు ఉన్నారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

## పోలీసులతో ఉద్యమాన్ని ఆపలేరు

**రాయదుర్గంరూరల్, జనవరి 3:** రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఉద్యమాలను ఆపలేదని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు రాధమ్మ పేర్కొన్నారు. పోలీసులు బుధవారం తెల్లవారుజామున మండలంలోని టీ వీరాపురం గ్రామం చేరుకుని రాధమ్మకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం చలో కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తుండగా పోలీసులు నోటీసు ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీ లీడర్‌కు నోటీసులు అందజేసిన పోలీసులు

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకా

**బెళుగుప్ప, జనవరి 3:** పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని స్థానిక పశువైద్య కేంద్రం డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. నోట్లో పుండ్లు ఏర్పడి చొంగ కారడం, కాలి గిట్ల మధ్య గాయాలు, జ్వరం రావడం సరిగా మేత మేయకపోవడం లక్షణాలు ఈ వ్యాధి సోకినట్లుగా గుర్తించి టీకాలు వేయించాలని తెలిపారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా: ఈఆర్వో


**ఉరవకొండ, జనవరి 3:** పొరపాట్లకు తావివ్వకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని ఈఆర్వో, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. అంతకు మునుపు ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఒకే రకమైన ఫొటో కలిగిన వారు, ఒకే రకమైన వివరాలు ఉన్నవారు సమారు 1600మంది దాకా ఉన్నారన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు ఓటర్లకు సంబంధించిన క్లైంలు అన్నీ పూర్తి చేయాలని బీఎల్వోలకు ఆదేశించారు. జీరో డోర్ నెంబర్ వంటి వాటి పైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఈడీటీ మునీంద్ర, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సాయివంశీ కృష్ణ, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో

## యువకుడి హత్య

**తాడిపత్రి, జనవరి 3:** పట్టణంలోని మెయిన్ బజారులో గల మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ వద్ద బుధవారం సాయంత్రం ఆరిఫ్ (29)ను ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారని పోలీసులు తెలిపారు. 2021 ఆగస్టు 15న ఆసుపత్రిపాలెంలో నిద్రిస్తున్న తల్లి, కుమార్తెలపై పెట్రోల్ పోసి హత్యచేసిన కేసులో ఆరిఫ్ ప్రధాన నిందితుడు. మృతుల కుటుంబానికి చెందిన వారు ఆరిఫ్‌ను హత్యచేశారా? లేక స్నేహితులా, ఆరిఫ్‌కు ఉన్న శత్రువులే మట్టుబెట్టారా అన్న కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో చుట్టుపక్కల ఉన్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని నిందితుల ఆచూకీ కోసం ఆరాతీస్తున్నట్లు సమాచారం. ఆరిఫ్ శవాన్ని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరిఫ్ కుటుంబ సభ్యుల నుంచి తీసుకొనే ఫిర్యాదు అనుసరించి విచారణను వేగవంతం చేస్తామని పోలీసులు తెలిపారు.



ఆరిఫ్ (ఫైల్)

## కాంగ్రెస్ కార్యకర్తలు టీడీపీలో చేరిక

**గుంతకల్లు, జనవరి3:** కాంగ్రెస్ కార్యకర్తలుగా పనిచేసిన పలువురు గురువారం ఉదయం టీడీపీలో చేరారు. మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడ వారికి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పాతగుంతకల్లులోని ఏడో వార్డుకు చెందిన ఎంప్లాయిస్ సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ సంఘ్ మాజీ చైర్మన్‌గా పనిచేసిన గొరవ మల్లయ్య, నవీన్, ఓబయ్య, మల్లయ్య, బొజ్జన్న, వెంకటేష్, ఈరన్న, జమ్మన్న, మోహన్, మధు, బాబావక్రుద్దీన్, కృష్ణ, సంచారజాతులకు చెందిన పలువురు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జితేంద్రగౌడు మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు, సానుభూతిపరులు దాదాపు 15 కుటుంబాలవారు టీడీపీలోకి చేరడం ఆనందదాయకమన్నారు. రైల్వే లోకో పైలెట్‌గా, ఎంప్లాయిస్ సంఘ్‌లో చైర్మన్ స్థాయి నాయకుడిగా పనిచేసిన జీ మల్లయ్య స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన అనంతరం టీడీపీలోకి రావడంపై హర్షాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనాథ్ గౌడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, టీ కేశప్ప, పాల మల్లికార్జున, హనుమంతు, కురుబ చంద్రశేఖర్, పూజారి బసప్ప, కే శివన్న, శివప్ప, ముక్కననగారి రామాంజనేయులు, గిడ్డయ్య రామన్న చౌదరి, కే సురేశ్, ఫజులు, తదితరులు పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జితేంద్రగౌడు

## సజ్జలదిన్నెలో పర్యటించిన మాజీ ఎంపీ జేసీ

**తాడిపత్రి, జనవరి3:** మండలంలోని సజ్జలదిన్నెలో బుధవారం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో జేసీకి నాయకుల నుంచి ఘనస్వాగతం లభించింది. నాయకుల ఇంటింటికి వెళ్లి స్థానిక రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కలిసికట్టుగా టీడీపీ కోసం పనిచేయాలని వారికి సూచించారు. జేసీ వచ్చారన్న విషయం తెలుసుకున్న మహిళలు ఆయన వద్దకు వచ్చారు. వారిని చూసిన జేసీ ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



జేసీకి సమస్యలను వివరిస్తున్న మహిళ

## వడ్లపాలెంలో బాబు ష్యూరిటీ

**తాడిపత్రి, జనవరి3:** పట్టణంలోని వడ్లపాలెంలో బుధవారం టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. మేనిఫెస్టోలోని అంశాలను వారికి వివరిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే పకడ్బందీగా అమలు చేస్తామని వారికి తెలియ జేశారు. ఆయన వెంట నాయకులు, టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

**పెద్దవడుగూరు:** మండలంలోని విరుపాపురం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, రమేష్‌యాదవ్, బాలిరెడ్డి, రాము కార్యకర్తలు ఉన్నారు.

## టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: ఉన్నం



కరపత్రాలను అందజేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

**కళ్యాణదుర్గం, జనవరి 3:** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. మండలంలోని ఓబుగానిపల్లిలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను అందజేసి కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో గాజుల శ్రీరాములు, దండా వెంకటేశులు, గోళ్ల వెంకటేశులు పాల్గొన్నారు.

## ఇటుకల మెషీన్‌లో పడి యువకుడి మృతి

**తాడిపత్రిటౌన్, జనవరి3:** మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామ సమీపంలోని బైరవ బ్రిక్స్ పరిశ్రమలో బుధవారం ఇటుకల మెషీన్‌లో పడి నవీన్ (17) మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు రావివెంకటాంపల్లికి చెందిన పుల్లయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నవీన్ ఇటుకల పరిశ్రమలో కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఇటుకలను తయారుచేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌లో పడి ఇరుక్కుపోయాడు. తోటి కూలీలు ఎంతో కష్టపడి నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. తండ్రి పుల్లయ్య గతంలోనే చనిపోవడంతో కుటుంబభారం నవీన్‌పై పడింది. కూలి పనులకు వెళుతూ తల్లిని పోషించేవాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి లక్ష్మీదేవి బోరున విలపించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**బొమ్మనహాళ్, జనవరి 3:** వేదావతి హగరి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం ఎస్ఐ ఆంజినేయులు పట్టుకున్నారు. మండల పరిధిలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు గ్రామ సమీపంలోని వేదావతి హగరి నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## టీచర్‌పై పోక్సో కేసు

**అనంతపురం క్రైం/గుత్తి, జనవరి 3:** మండలంలోని తొండపాడు గ్రామంలో ఔట్ సోర్సింగ్ కింద యోగా టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లబోతుల అనిల్‌కుమార్‌రెడ్డిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు గుత్తి సీఐ వెంకట రామిరెడ్డి తెలిపారు. సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో వంచించిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు నెలల క్రితం ఆ అమ్మాయి పుట్టినరోజు ఉండటంతో కుటుంబ సభ్యులు బంగారు నగలు చేయించారు. దీంతో యోగాటీచర్ తనకు అవసరాలు ఉన్నాయని బంగారు తీసుకురమ్మని, తర్వాత తిరిగి బంగారు ఇస్తానని ఆ అమ్మాయిని మాయమాటలతో నమ్మించాడు. ఈక్రమంలో బంగారం తీసుకుని, అమ్మాయితో పాటు గత ఏడాది డిసెంబరు 26న ఉడాయించినట్లు సమాచారం. తల్లిదండ్రులు గుత్తి పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. అప్పటి నుంచి జనవరి 3వ తేదీ వరకూ ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లో కొద్దిరోజులపాటు తలదాచుకున్నట్లు తెలిసింది. సెల్‌ఫోన్ ఆధారంగా నిందితున్ని గుర్తించినట్లు సమాచారం. గతంలోనూ ఈ యోగా టీచర్ ఇలాంటి ఉదాంతాలకు పాల్పడినట్లు తెలిసింది. మరో ఇద్దరు బాలికలతోనూ ప్రేమాయణం నడుపుతున్నట్లు చర్చించుకుంటున్నారు.

## అంగన్‌వాడీల అరెస్టు అమానుషం

- టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి

**పామిడి, జనవరి 3:** అంగన్‌వాడీ వర్కర్ల అరెస్టు అమానుషమని టీడీపీ నాయకుడు, పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార దాహంతో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ నోటికి వచ్చిన హామీలు గుప్పించారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేపడితే, వారిపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల అంగన్‌వాడీల అరెస్టు ఇందుకు నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు



మేనిఫెస్టో కరపత్రిక ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు

**పుట్లూరు, జనవరి3:** టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, రామాంజనేయులు, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రంగప్ప, సూర్యనారాయణరెడ్డి, జయుడు, రాధ, నరసింహ, జీవన్ పాల్గొన్నారు.

## నామమాత్రంగా సామాజిక తనిఖీ

**యాడికి, జనవరి3:** ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై బుధవారం యాడికిలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక నామమాత్రంగా కొనసాగింది. ప్రజావేదిక నిర్వహణ సమాచారాన్ని ప్రజలకు అధికారులు తెలియజేయకపోవడంతో సమావేశంలో ప్రజాప్రతినిధులుగానీ, ప్రజలు గానీ పాల్గొనలేకపోయారు. కేవలం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతోనే సమావేశాన్ని నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023మార్చి 31వరకు ఉపాధి పనులు, ఉపాధిహామీ అనుసంధాన పథకం పనులపై 16వ విడత సామాజిక తనిఖీ బృందం వారు నివేదికలను అధికారులకు చదివి వినిపించారు. మండలంలోని 14గ్రామ పంచాయతీల్లో రూ.12910 రికవరీకి అధికారులు ఆదేశించారు. ప్రజావేదికలో డీడబ్ల్యుఎంఏ పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీవీఓ వైపీ రమణారెడ్డి, ఏపీడీ వెంకటరత్నం, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు. కాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన టెంటు అధికారులపై కూలడంతో తృటిలో ప్రమాదం తప్పింది. అక్కడే ఉన్న ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు సర్దుబాటు చర్యలు చేపట్టారు.



నివేదికలు పరిశీలిస్తున్న అధికారులు

## టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

**కుందుర్పి, జనవరి 3:** మండలంలోని బెస్తరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోయ ఓబుళపతి బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వర నాయుడు ఓబుళపతి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి చంద్రన్న స్ఫూర్తితో ఉమన్న ఆర్థిక సాయం కింద రూ. ఐదు వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రామాంజనేయులు, రవి, ఈరన్న, వీరేష్ యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

## ఇంటింటికి అయోధ్య అక్షింతల పంపిణీ

**బెళుగుప్ప, జనవరి 3:** మండల కేంద్రంలో బుధవారం ఇంటింటికి అయోధ్య రామ అక్షింతలు హిందూ ధర్మ భక్త మండలి సభ్యులు పంపిణీ చేశారు. ఈ నెల 22 నుంచి జరిగే అయోధ్య రామ మందిర పూజా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ అక్షింతలు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, భక్త మండలి సభ్యులు కోకుర్తి ధనుంజయరెడ్డి, ఎం ధనుంజయ, నల్లపరెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



బెళుగుప్పలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

## భూ వివాదంపై వాగ్వాదం

**కూడేరు, జనవరి 3:** భూ వివాదం విషయంగా తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వీఆర్ఓ, వైసీపీ నాయకులు మధ్య వాగ్వాదం జరిగింది. అంతరగంగ గ్రామానికి చెందిన రామాంజనేయులు భూ పంపిణీలో పట్టా పొందాడు. ఆ భూమిలో దళితులు సాగులో ఉండటంతో గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. దళితులు సాగు చేసిన భూమి ఇవ్వడం కుదరదని రెవెన్యూ అధికారులు తేల్చి నివేదికలు ఉన్నతాధికారులకు పంపారు. దీంతో రామాంజనేయులు మరోచోట సాగు చేసిన భూమినైనా పట్టా ఇప్పించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్న ఆక్రోశంతో కొందరు వైసీపీ నాయకులతో కలిసి కార్యాలయంలో తహసీల్దారు ఎదుటే వీఆర్‌ఓతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొనడంతో జోక్యం చేసుకున్న తహసీల్దారు రామాంజనేయులు సాగు చేసిన భూమిని పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

## జగన్ పాలనకు చరమగీతం పాడాలి

**బొమ్మనహాళ్, జనవరి 3:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ మహిళా మండల అధ్యక్షురాలు శ్యామల పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లింగదహాళ్ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మీ ఇంటికి అందే సంక్షేమ పథకాలు వివరించారు. టీడీపీ నాయకులు తిప్పేస్వామి, గోపాల్, మున్నా, చాంద్‌బాష, మల్లి పాల్గొన్నారు.



లింగదహాళ్‌లో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

## అక్షింతలు పంపిణీ

**పెద్దవడుగూరు, జనవరి3:** మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికతోపాటు ఆలయ నమూనా ఫొటోలను అందించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామమందిరం ప్రారంభోత్సవం దృష్ట్యా అక్షింతలను ప్రజలందరికి అందజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

**గుంతకల్లుటౌన్, జనవరి3:** పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ ప్రత్యేక అధికారి, ఏడీఏ చంగల్రాయుడు తనిఖీ చేశారు. దుకాణాలలో పురుగుల మందుల నిల్వలు, ఇన్వాయిస్ బిల్లులు, స్టాక్, సెల్స్ రిజిస్టర్, ధరల పట్టికను పరిశీలించారు. అనుమతి లేని రూ. 63,515లు విలువ చేసే 503లీటర్ల పురుగుల మందుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగులు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పక రసీదులు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారి స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**పుట్లూరు, జనవరి 3:** స్థానిక చింతకుంట రోడ్డులో ఉన్న కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1340 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. కాగా శనగలగూడూరు, మడ్డిపల్లి, మడుగుపల్లి, గాండ్లపాడు గ్రామాలకు చెందిన ఐదుగురిని ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ చేశామని ఎస్ఐ తెలిపారు.